ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

శుక్రవారం 31 అక్టోబరు 2025

శభాష్..దినేశ్..!

- రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ప్రీకాస్ట్ టెక్నాలజీ
- వాహనాలకు ఆటంకం లేకుండా 40రోజుల్లో పూర్తి
- ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్న హోసూరు కలెక్టర్ దినేశ్ కుమార్

9

ప్రపంచ సంస్కృతి, సాహిత్యానికి వేదిక

- వాడియా కలల ఆశయమే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్
- ఆరుగురు సభ్యులతో ప్రారంభం..నేడు 3,702 మంది
- ఎందరో ప్రముఖుల సందర్శన
- దేశంలోనే పెద్దదిగా పేరు
- 80 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు



ఇన్‌స్టిట్యూట్‌లోని అతిపెద్ద లైబ్రరీ



బీపీ వాడియా

ప్రముఖుల ప్రశంసలు..

నోబెల్ పురస్కార గ్రహీతలతోపాటు మైసూరు మహారాజు జయచామరాజేంద్ర ఒడియార్, తిరువనంతపురం రాజామార్తాండవర్మ, శాస్త్రవేత్తలు హోమీ జే బాబా, విక్రమ్ సారాభాయి, సీ రాజగోపాలాచారి, వీవీ గిరి, రాజేంద్రప్రసాద్, సర్ మిర్జా ఇస్మాయిల్ వంటి ప్రముఖులు సంస్థను సందర్శించారు. లెక్కకు మించినంతమంది సంగీత కళాకారులు, సాహితీవేత్తలు, నాట్య నిపుణులు, నాటకరంగ కళాకారులు తమ ప్రతిభను సంస్థ వేదిక ద్వారా ప్రదర్శించారు. అసంఖ్యాకమైన శాస్త్రవేత్తలు, భిన్నరంగాలకు చెందిన ఉపన్యాసకులు ఇక్కడ ప్రసంగించారు.

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దేశీయ సాహిత్య సంస్కృతితోపాటు విదేశీ సంస్కృతిని పరిచయం చేసే వేదిక బసవనగుడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్ (ఐడబ్ల్యుసీ). బసవనగుడి వాతావరణానికి విదేశీ సంస్కృతిని పరిచయం చేసినట్టుగాను, ఉత్తమ విలువలు కల్పించడంతోపాటు దేశీయ సాహిత్య సంస్కృతి అధ్యయనానికి నెలవై ఉంది. బీపీ వాడియా కలల ఆశయమే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్. 1945లో స్థాపించబడిన సంస్థ ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతుండడం గర్వకారణం అని చెప్పవచ్చు. నృత్యం, సంగీతం, కళా ప్రదర్శనలు, చర్చాగోష్టులతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు సంస్థ వేదికగా ఉంది. వాడియా 58వ యేట సంస్థకు శ్రీకారం చుట్టారు. 15ఏళ్లపాటు ఆయన పర్యవేక్షణలోనే కొనసాగింది. 78వ వయసులో ఆయన తుదిశ్వాస వీడారు. బెంగళూరు అంటేనే ఉద్యాననగరిగా స్వచ్ఛమైన వాతావరణం కల్గిన ప్రాంతంగా దేశమంతటా పేరుంది. అయితే నగరీకరణ, ఆధునిక నిర్మాణాలతో పచ్చదనం కొన్ని ప్రాంతాల్లో తగ్గిపోయింది. కానీ బసవనగుడి ప్రాంతంలో ఇప్పటికీ అదే పచ్చదనం కొనసాగుతోంది.

నాలుగేళ్లపాటు అద్దెభవనంలో కొనసాగిన సంస్థకు 1948లో సొంతంగా స్థలాన్ని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి సంస్థ నిరంతరంగా సేవలు కొనసాగిస్తోంది. ఇటీవల 17 దేశాలకు సంబంధించిన 30 సినిమాలను ఇక్కడ ప్రదర్శించినట్టు సంస్థ గౌరవ కార్యదర్శి అరకలి వెంకటేశ్ ప్రసాద్ తెలిపారు. ఆగస్టులో రెండో ప్రపంచయుద్ధం ముగిసింది. ఆ తర్వాత రెండోరోజుకే బీపీ వాడియా సంస్థను అస్థిత్వంలోకి తీసుకొచ్చారు. వాడియాది థియోసఫీ (మతపరమైన ఉద్యమం) అయినా ప్రపంచంలోని మనుషులంతా ఒక్కటేననే ఆలోచనతో సంస్థకు శ్రీకారం చుట్టారు. వ్యక్తిని సంస్కృతిని పెంపొందించేలా చూడాలనేది ఆయన ఆశయంగా ఉండేది. ఇక్కడికి వచ్చేవారికి వివిధ దేశాల సాహిత్య సంస్కృతిని పరిచయం చేయాలని భావించారు. అందుకోసమే వరల్డ్ కల్చర్ అని పేరు పెట్టారు. ప్రజలు స్వతంత్రులుగా ఉండాలనే ఆలోచనతోనే బ్రిటీష్‌వారిపైనా పోరాడారు. రెండేళ్లపాటు జైలుశిక్షను అనుభవించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నా ఎక్కువగా సంస్కృతి కోసం పనిచేసేవారు. ఆయన కృషితోనే పూర్తి చేసుకున్న గ్రంథాలయం నేడు ఎందరికో విజ్ఞానాన్ని పంచుతోంది.



బసవనగుడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్ ప్రవేశద్వారం

1945లో శ్రీకారం

శాంతికేంద్రం ప్రారంభించాలని భావించిన వాడియా రెండో ప్రపంచయుద్ధం ముగిసిన మరుసటి రోజే 1945 ఆగస్టు 11న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్‌కు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం 80ఏళ్లు అవుతోంది. అయితే ఇప్పటివరకు సంస్థకు సంబంధించి వివాదాలు కానీ విభేధాలు కానీ కొనసాగిన ఆనవాళ్లు లేవు. ఉన్నత విద్యకోసం అవసరమైన పుస్తకాలను, పరిశోధనలకు అవసరమైన ఎన్నో గ్రంథాలకోసం సంస్థకు వస్తుంటారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు, న్యాయమూర్తులు, విద్యా నిపుణులు ప్రస్తుతం సభ్యులుగా కొనసాగుతున్నవారిలో ఉన్నారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్, భారతీయ విద్యాభవన్‌తో కలసి కార్యక్రమాలను జరుపుతుంటారు. కన్నడ సంస్కృతిశాఖ సహకారంతో సాహిత్య కార్యక్రమాలు జరుపుతామని కార్యదర్శి వెంకటేశ్ ప్రసాద్ తెలిపారు.

సంపన్నుల కుటుంబంలో పుట్టినా సామాన్యుల వైపే..

బహమంజి పెస్టోంజి వాడియా 1881లో అక్టోబరు 8న బాంబేలోని పార్సీ కుటుంబంలో జన్మించారు. యువకుడిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రవేశించారు. శ్రీమంత కుటుంబానికి చెందినవారైనా కార్మిక వర్గానికి చెందినవారితో అధిక సంబంధాలు కలిగి ఉండేవారు. తండ్రి కొనసాగిస్తున్న జౌళి పరిశ్రమను ఆ తర్వాత వాడియా కొనసాగించారు. అయితే అతను పారిశ్రామికవేత్తగా కొనసాగాలని భావించలేదు. బదులుగా బ్రిటీష్ సమాజానికి చెందిన అనిబిసెంట్‌తోపాటు సుప్రసిద్ధ మేధావులతో సంబంధాలు కలిగి ఉండేవారు. జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ వంటివారితో వ్యక్తిగత పరిచయం ఉండేది. సీనియర్ సిటిజన్‌గా 65ఏళ్ల వయస్సులో బీపీ వాడియా తన మనస్సును విశ్రాంత జీవనానికి కేటాయించలేదు. మహోన్నతమైన ఆలోచనలతో దేశసేవకు పాటుపడ్డారు. పదులసంఖ్యలో పుస్తకాలు రాసిన వాడియా, సంస్థ ప్రాంగణంలోనే లైబ్రరీని ఏర్పాటు చేశారు. సొంతనిధితోపాటు దాతల నుంచి విరాళాలు సేకరించి విశాలమైన ప్రాం తంలో 'ప్రజా గ్రంథాలయాన్ని' నిర్మించారు. 1947లో ప్రారంభమైన గ్రంథాలయం దాతల సహకారంతో కొనసాగుతోంది. 1951లో భవనం పైభాగంలో నిర్మించిన లైబ్రరీ ప్రస్తుతం దేశంలోనే అతిపెద్దదిగా పేరొందింది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇక్కడ లభిస్తాయి. పిల్లలకోసం ప్రత్యేక గ్రంథాలయం ఉంది. ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఏడాదికి రూ.200 చెల్లించి చదువుకునే సౌకర్యం ఉంది. ఇప్పటికీ సంగీత సాహిత్య కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. 1945లో ప్రారంభమైన సంస్థ ఆరుగురు అధ్యక్షులతో కొనసాగారు. 3,702మంది రెగ్యులర్ సభ్యులు ఉన్నారు.



పిల్లలకు విజ్ఞానం పంచుతున్న ప్రత్యేక గ్రంథాలయం

విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించాలనుకుని..

వాస్తవానికి వాడియా ప్రపంచంలోనే పేరొందేలాంటి ఓ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించాలని కలలు గన్నారు. యడియూరు సమీపంలో 28 ఎకరాల భూమిని యూనివర్సిటీ కోసం ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే రెండేళ్లకు వాపసు తీసుకుని జయనగర్ లే అవుట్‌గా ఏర్పాటు చేసింది. దీంతో విశ్వవిద్యాలయం ప్రారంభించాలనే కల తప్పినట్టయ్యింది. దేశంలో తొలి కార్మికసంఘాన్ని మద్రాస్ జౌళి కార్మికసంఘం పేరిట ప్రారంభించారు. నిస్సహాయ కార్మికులకోసం వాడియా హౌస్‌ను తెరిచారు. 1919లో వాషింగ్టన్ డీసీలో లీగ్ ఆఫ్ నేషన్స్ ద్వారా జరిగిన తొలి అంతర్జాతీయ కార్మిక సమ్మేళనంలో భాగస్వామ్యం వహించేందుకు భారత్‌నుంచి ప్రతినిధిగా వెళ్లారు. స్వయంసేవకులు, దాతల సహకారంతో ఏర్పడిన సంస్థ అమృత మహోత్సవం ఆచరణకు సిద్ధమైంది. ఈ ప్రయాణంలో ప్రభుత్వంతోపాటు వివిధ సంఘసంస్థలు సహకరించాయని ప్రత్యేక కళావిభాగంతో దేశ విదేశీ ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు జరిగాయన్నారు. ప్రతి ఆదివారం సాహిత్య సంబరం అనే వాతావరణం ఇక్కడ కొనసాగుతుంది. వాడియా లైబ్రరీ ఇప్పటివరకు వేలాదిమంది పుస్తకాలను విడుదల చేసిన చరిత్ర ఉంది. ప్రపంచదేశాల సంస్కృతి సాహిత్యం, ప్రదర్శనలకు వేదికగా సాగుతూ నేటి తరానికి ఆదర్శం అనిపిస్తోంది.

చేతులు ఎత్తితే సభాపతి కావచ్చు..

ఎమ్మెల్యే కాలేరు: ప్రదీప్ ఈశ్వర్



బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : రాజకీయాలలో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమే కానీ ఇటీవల అన్ని విషయాలలోను కాంగ్రెస్‌కు చెందిన వారు హాట్‌టాపిక్‌గా మారుతున్నారు. అటువంటి వారిలో చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ కూడా ఒకరు. ఇటీవల మీడియాతో మాట్లాడిన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రదీప్‌ఈశ్వర్ ఓ ఆకస్మిక ఎమ్మెల్యే అన్నారు. అందుకు ప్రదీప్ ఈశ్వర్ గురువారం స్పందిస్తూ పరిషత్‌లో సభ్యులు చేతులు ఎత్తితే సభాపతి కాగలరని కానీ ఎమ్మెల్యే కావడం సాధ్యం కాదన్నారు. కనీసం లక్ష ఓట్లు కావాలన్నారు. అయితే ప్రదీప్ ఈశ్వర్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సభాపతి బసవరాజ హొరట్టి ఏడుసార్లు వరుసగా ఒకే స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన వారు. అటువంటి చరిత్ర కలిగిన వారు బహుశా దేశంలోనే లేరు. అటువంటి సీనియర్ నేతపైనా నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని విమర్శలు వ్యక్తం కాగా కొందరు ప్రదీప్‌ఈశ్వర్‌కు మద్దతుగాను సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు.

2,200 గదుల నిర్మాణానికి కేబినెట్ నిర్ణయం

- పాఠశాలల ఆధునికీకరణే లక్ష్యం
- సబ్‌ప్లాన్ నిధులు గ్యారెంటీలకా..?
- మంత్రి మహదేవప్ప ఆగ్రహం

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అవసరాలను బట్టి 2,200 పాఠశాల గదులను నిర్మించేందుకు మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. తీర్మానాలను శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు యాదగిరి డయట్ కళాశాల అధ్యాపకులు వెంకయ్య ఇనామ్‌దార్ లోకాయుక్తకు పట్టుబడిన మేరకు విధుల నుంచి తొలగించారు. రాష్ట్రంలోని సముద్రతీరం ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పీపీపీ పద్ధతిన చేపట్టాలని తీర్మానించారు. నాలుగు ఓడరేవులను మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. బనశంకరిలో వెంకటరమణ స్వామి ఆలయానికి 30 ఏళ్లకు సీఏ నివేసన స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు తీర్మానించారు. మండ్య కాంగ్రెస్ భవనానికి భూమి కేటాయిస్తూ తీర్మానించారు. కోలార్‌లో కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు తీర్మానించారు. యాదగిరి జిల్లా శహపురలో కనకభవన్ నిర్మాణాలకు భూమిని మంజూరు చేశారు. మండ్య వ్యవసాయ విశ్వవిద్యాలయంకు రూ.23.25 కోట్లు నిర్మాణాలకు మంజూరు చేశారు. 8 ప్రాంతాలలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్స్‌లను స్థాపించదలచారు. ఇటీవల వర్షాలతో నష్టం జరిగిన ప్రాంతాల అభివృద్ధికి రూ.1545.23 కోట్లు మంజూరు చేయాలని ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు విన్నవించేలా తీర్మానించారు. గంగా కళ్యాణ పథకం లబ్దిదారుల బాధ్యత జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు కేటాయించారు. పోలీసు శాఖకు 241 వాహనాల కొనుగోలుకు రూ.34.95కోట్లు మంజూరు చేశారు. గ్రేటర్ బెంగళూరు క్రియాయోజన ప్రారంభానికి అనుమతులు ఇచ్చారు. కాగా కేబినెట్‌లో సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మహదేవప్ప మండిపడినట్లు సమాచారం. ప్రత్యేకించి విద్యుత్‌శాఖా మంత్రి కేజె జార్జ్‌తో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ఇదే సందర్భంలోనే సబ్‌ప్లాన్ నిధులు గ్యారెంటీలకు వాడుతున్నారని కూడా వ్యాఖ్యానించినట్లు సమాచారం.



పెళ్లింట విషాదం

- వివాహానికి ముందురోజు గుండెపోటుతో వధువు మృతి
- అజ్జంపురలో సంఘటన



బెంగళూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వివాహానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి..వేడుకలకు బంధువులు అందరూ చేరుకున్నారు. గుండెపోటుతో వధువు కన్ను యూయడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. జీవితంలో కొత్త అధ్యాయానికి అడుగులు వేడయానికి సిద్ధమైన యువతి జీవితం అకస్మికంగా ముగిసిన సంఘటన చిక్కమగళూరు జిల్లా అజ్జంపుర తాలూకాలో గురువారం చోటు చేసుకుంది. 31న శుక్రవారం పెళ్లి జరగాల్సి ఉంది. సొల్లాపుర గ్రామానికి చెందిన శ్రుతి (24) అకస్మికంగా మృతి చెందింది. ప్రాథమిక సమాచారం ప్రకారం లో బీపీ, గుండెపోటుతోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. శ్రుతి వివాహం తరికెరె పట్టణంలో దిలీప్‌తో శుక్రవారం జరగాల్సి ఉంది. గురువారం మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనపై అజ్జంపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎంపీ తేజస్వీ సూర్య.. ఓ వేస్ట్ మెటీరియల్

- కుటుంబంతో కలిసి బస్సులో తిరుగుతారా..?
- సొరంగమార్గం వద్దనేందుకు అతడెవరు: డీసీఎం డీకే



బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంపీ తేజస్వీ సూర్య ఇంకా చిన్నపిల్లోడని అనుభవం లేదని అతను ఓ వేస్ట్ మెటీరియల్ అంటూ డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ నగరంలో సొరంగ మార్గం నిర్మించరాదనేందుకు తేజస్వీ ఎవరని ప్రశ్నించారు. దేశంలోనే కాదు ప్రపంచంలోనే సొరంగ మార్గాలు వద్దనే రీతిలో మాట్లాడతారన్నారు. కేంద్రమంత్రి అయినప్పుడు లోక్‌సభలో తీర్మానం చేయాల్సింది అంటూ మండిపడ్డారు. టన్నెల్‌రోడ్డు ప్రాజెక్టును నిపుణుల అభిప్రాయం ప్రకారం చేయాల్సి ఉండేది కదా అనే మీడియా ప్రశ్నకు సమాధానంగా ఏదో ఎంపీ కదా అంటూ గౌరవం ఇచ్చి మాట్లాడే అవకాశం ఇస్తే ఏదేదో మాట్లాడతారన్నారు. తేజస్వీకు ప్రపంచ ఎలా ఉందనేది తెలియదంట అని మండిపడ్డారు. తాను యువకుడిగా ఉన్నప్పుడు కారు లేదంటే పెళ్ళికి అమ్మాయిని ఇచ్చేవారు కాదని చెప్పానని అదే అంశాన్ని ప్రస్తావిస్తారన్నారు. తేజస్వీతో పాటు కుటుంబం బస్సు, మెట్రోలో ప్రయాణిస్తారా అంటూ ప్రశ్నించారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలలోనే బీజేపీ వారంతా తిరగమనండి.. ఎవరు వద్దని చెప్పరన్నారు. బెంగళూరులో 1.30 కోట్ల మంది జనాభా ఉన్నారని ఏటా వలస వచ్చేవారు పెరుగుతూనే ఉన్నారన్నారు. రాష్ట్రానికి మెట్రో తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కాగా ఎంపీ తేజస్వీ సూర్య మాట్లాడుతూ 1800 కార్లు తిరిగేందుకు రూ.43వేల కోట్లు ఖర్చు పెట్టడం సాధ్యమా అని ప్రశ్నించారు. వేలకోట్లతో 18 కిలోమీటర్ల సొరంగ మార్గం ప్రయోజనకరమైన ప్రాజెక్టు అవుతుందా అని ప్రశ్నించారు. మెట్రో, సబ్ అర్బన్ రైళ్ళ సంఖ్యను పెంచాల్సి ఉందని వివరించారు. ప్రజా సంక్షేమం కొరకే ప్రభుత్వం పని చేస్తోందని, ప్రతిపక్షాలు విమర్శించడం తగదన్నారు.

చెత్త పనులకు జరిమానా తప్పదు

- ఎక్కడ పడితే అక్కడ చెత్త పారవేయరాదు
- మార్షల్స్ అన్నీ గమనిస్తారు
- సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎండీ కరిగౌడ

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇంట్లోని చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను పాలికెకు చెందిన చెత్తసేకణ బండి వచ్చినప్పుడు అందులోనే వేయాలని, అలాకాకుండా ఇష్టం వచ్చినట్టు పడేస్తే కఠినచర్యలు తప్పవని జీబీఏ పరిధిలోని బెంగళూరు సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్ లిమిటెడ్ (బీఎస్‌డబ్ల్యుఎంఎల్) మేనేజింగ్ డైరెక్టర్ కరిగౌడ హెచ్చరించారు. గ్రేటర్ పరిధిలో చెత్తను ఇష్టం వచ్చినట్లు చెత్త పడేయకుండా గురువారం ప్రత్యేక అభియాన చేపట్టారు. డీసీఎం, బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి డీకే శివకుమార్ సూచనలు పాటిస్తున్నట్లు తెలిపారు. చెత్త నిర్వహణకు సంబంధించి మార్షల్స్ పర్యవేక్షిస్తుంటారన్నారు. ఎవరైనా ఇష్టం వచ్చినట్టు పడేసినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి కొన్ని టిప్పర్లతో ఇళ్ల వద్ద చెత్తను పడేయడంతోపాటు జరిమానా విధించామన్నారు. బెంగళూరు తూర్పు పరిధిలో ఇటీవల వాక్ విత్ సిటిజన్స్ ఇనిషియేటివ్ అనంతరం అధికారులతో డీసీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించారన్నారు. నగర సౌందర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవాలని జీబీఏ చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావుకు సూచనలు చేశారని తెలిపారు.



నిబంధనలు ఉల్లంఘించినవారి ఇంటి ముందు చెత్తను పారబోసి హెచ్చరిస్తున్న గ్రేటర్ అధికారులు



నీటి కుంటలా మారిన 110కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

7

కరెంటోళ్లకు కానరాదా..!

- మడుగును తలపిస్తున్న సబ్‌స్టేషన్
- భయపడుతున్న కాలనీవాసులు

గుదిబండలా గోడౌన్లు!

ఉమ్మడి జిల్లాకు 195 మంజూరు
131 గోదాముల నిర్మాణం పూర్తి

- బిల్లులు చెల్లించినా ఉపయోగంలోకి రాని వైనం
- సొసైటీలకు భారంగా మారిన ఈఎంఐల చెల్లింపు
- ఓ డెప్యుటేషన్ అధికారి నిర్వాకంతోనే సమస్యలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గోడౌన్‌ల నిర్మాణం సొసైటీలకు మోయలేని ఆర్థిక భారాన్ని మిగిల్చింది. డెప్యుటేషన్‌పై జిల్లాకు వచ్చిన ఓ అధికారి నిర్వాకం సొసైటీలకు శాపంగా మారింది. సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 2021-22లో ఉమ్మడి జిల్లాకు 195 గోడౌన్లను కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఆప్కాబ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీ అధికారులు నాబార్డు నుంచి రుణాలు తీసుకుని గోడౌన్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు 131 గోడౌన్లను మాత్రమే పూర్తి చేశారు. వాటిని కూడా సహకార శాఖకు అప్పగించకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకు రుణం తీసుకుని చెల్లించిన బిల్లుల మొత్తం దాదాపు రూ.70 కోట్లకు సొసైటీల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇది సొసైటీలకు మోయలేని భారంగా మారింది. విజయవాడలో ఉండి విధులు నిర్వహించాల్సిన ఓ ఆప్కాబ్ అధికారి గత వైసీపీ పాలనలో ఇక్కడికి డెప్యుటేషన్‌పై వచ్చారు. స్వామి భక్తిని ప్రదర్శిస్తూ ఆయన వైసీపీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి ముడుపులు పుచ్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిర్మించిన గోడౌన్లు కూడా నాసిరకంగా ఉన్నాయని ఆశాఖలోని పలువురు అధికారులు వాపోతున్నారు. పని పూర్తి చేయకనే, స్వాధీనం చేయక ముందే సొసైటీలకు మాత్రం ఈఎంఐల బాధ తప్పడం లేదు.


శింగనమలలో నిరుపయోగంగా ఉన్న సొసైటీ గోడౌన్

గడువు ముగిసినా..

మూడేళ్ల డెప్యుటేషన్ గడువు ముగిసినా ఆప్కాబ్ అధికారి ఇక్కడే ఉంటున్నారు. గోడౌన్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆ అధికారిది పాత్ర కీలకం. ఇప్పటి వరకు రెండు జిల్లాకు సంబంధించి గోడౌన్ల నిర్మాణంలో దాదాపు రూ.70కోట్లు చెల్లించారు. గోడౌన్ల నిర్మాణం పూర్తి అయిన తరువాత క్షేత్రస్థాయిలో సహకార శాఖ, మార్కెటింగ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీల అధికారులు బృందంగా పర్యవేక్షణ చేసిన అనంతరం బిల్లులు చెల్లించాలి. కానీ వాటాలు పుచ్చుకుని ముందే చెల్లించారు. గోడౌన్ల నిర్మాణం నాసిరకంగా ఉన్నట్లు ఆయా సొసైటీల అధికారులు బహిరంగంగానే చెబుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. నిర్మాణం పూర్తి అయిన గోడౌన్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కాగా డెప్యుటేషన్‌పై వచ్చిన ఆ అధికారి ఆగడాలు భరించలేకపోతున్నామని ఆశాఖలోని ఉద్యోగులు కొందరు వాపోతున్నారు.

రెండు రకాల గోడౌన్లు మంజూరు

అనంతపురం జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 18, 500మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో 84 గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 21, 500మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 72 మొత్తంగా 93 గోడౌన్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో 68, శ్రీసత్యసాయి జిల్లాలో 63గోడౌన్ల నిర్మాణం పూర్తి చేశారు. వెయ్యి మెట్రిక్‌టన్నుల గోడౌన్ రూ.85లక్షలు, 500మెట్రిక్ టన్నుల గోడౌన్లకు రూ.45లక్షల నిధులు కేటాయించారు.


బుక్కరాయసముద్రంలో నిర్మించిన గోడౌన్

స్వాధీనం చేయకనే ఈఎంఐలు

గోడౌన్లను స్వాధీనం చేయకముందే ఈఎంఐలు చెల్లించాలనడం సొసైటీలకు భారంగా మారింది. గోడౌన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఉపయోగంలోకి వస్తే, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఈఎంఐలు చెల్లించే అవకాశం సొసైటీలకు కలుగుతుంది. నాబార్డు ద్వారా ఆప్కాబ్‌కు, అక్కడి నుంచి ఏడీసీసీ బ్యాంకుకు, దాని నుంచి సొసైటీలకు రుణాలు చెల్లిస్తారు. సొసైటీలు తీసుకున్న రుణాలకు 4శాతం వడ్డీతో తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు రుణం ఇచ్చినప్పటి నుంచే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇదే ఇప్పుడు సొసైటీలకు భారంగా మారింది.

స్వాధీనం చేసుకోవాల్సి ఉంది



సహకార శాఖకు సంబంధించిన గోడౌన్లను స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. నిర్మించిన గోడౌన్‌లను స్వాధీనం చేయాలని పలుమార్లు మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ రాశాం. అయితే ఇప్పటి వరకు ఒక్కటి స్వాధీనం చేయలేదు. నిర్మాణం పూర్తి అయిన వాటికి బిల్లులు చెల్లించారు. ఈ చెల్లింపులన్నీ ఆప్కాబ్, మార్కెటింగ్ శాఖద్వారానే జరిగాయి. స్వాధీనం చేసిన గోడౌన్‌లను అద్దెకు ఇచ్చి, సంపద వృద్ధి చెందేలా చూస్తాం.

- అరుణకుమారి,
జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

మొక్కపోయిన ధర

- మొక్కజొన్నకు మద్దతు ధర కరువు
- నష్టాలు తప్పవంటున్న రైతులు




పొలాల్లో నిల్వ ఉన్న మొక్కజొన్న పంట, నూర్పిడి చేస్తున్న యంత్రం

శింగనమల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంతో కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధరలేక తీవ్రంగా నష్టపోతున్నామని మొక్కజొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది గిట్టుబాటు ధర లభించడంతో మండలంలో ఈ ఏడాది 30 గ్రామాల పరిధిలో విస్తారంగా మొక్కజొన్న సాగు చేశారు. దాదాపు 2వేల ఎకరాల్లో సాగు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. గత ఏడాది మద్దతు ధర రూ.2600 ఉండటంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. అయితే ఈ ఏడాది ప్రభుత్వమే మద్దతు ధర క్వింటాకు రూ.2400 ప్రకటించింది. దీంతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు విక్రయించకుండా పొలాల్లోనే ఆరబోస్తున్నారు. దళారీలు రంగ ప్రవేశం చేసి ఆ ధరను కూడా రెండువేల లోపునకు తెచ్చినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు శూన్యం

కొనులుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. 20 రోజులగా పంట నూర్పిడి జరుగుతున్న నేటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీరా దళారీలు పంట కొనుగోలు చేశాక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎవరికి ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు.

గుత్తకు తీసుకుని సాగు చేశా: రైతు నాగమునయ్య, జూలాకాల్వ



గత ఏడాది రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఖర్చులన్నీ పోను బాగానే గిట్టుబాటు అయ్యింది. దీంతో ఈ ఏడాది నా పొలంతో పాటు మరో ఏడు ఎకరాలు గుత్తకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. రూ.4 లక్షల దాకా పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగా వచ్చింది. అయితే ధర మాత్రం నేల చూపులు చూస్తోంది. క్వింటా రూ. రెండువేలకు అడుగుతున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో పొలంలోనే ధాన్యం ఆరబోశాం. అయితే వాన దేవుడు నష్టం కలిగిస్తాడేమోననే భయం కూడా వెంటాడుతోంది.

రూ.రెండు వేల లోపే: మహిళా రైతు అరుణ, జూలాకాల్వ



మేము నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశాం. దిగుబడి బాగుంది. అయితే నిన్న మొన్నటి దాకా ఉన్న ధర ప్రస్తుతం లేకుండా పోయింది. కింటా రూ.2వేలకు అడుగుతున్నారు. అప్పులు చేసి రూ.రెండున్న లక్ష వరకు పెట్టుబడి పెట్టాం. గిట్టుబాటు ధర లేకపోతే అప్పులకు వడ్డీలు కూడా కట్టడం కష్టమవుతుంది. ప్రభుత్వమే మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి.

ఉన్నతాధికారులకు నివేదించాం: అన్వేష్‌కుమార్, ఏఓ, శింగనమల



మండలంలో రైతులు ఎక్కువ శాతం మొక్కజొన్న పంట సాగు చేశారు. వారి ప్రయోజనం దృష్ట్యా మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే క్షేత్ర స్థాయిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం. మద్దతు ధరతో మొక్కజొన్న పంట కొనుగోలు చేస్తాం.

సహకార వ్యవస్థను బలోపేతం చేద్దాం



అంతర్జాతీయ సహకార సంవత్సర వేడుకల్లో ఏడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులు, డీసీఓ అరుణకుమారి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 వేడుకలను గురువారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో డీసీఎంఎస్ సేవలను మరింత విస్తృత పరిచేలా ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అటు రైతులు, ఇటు పేదలకు సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ... డీసీఎంఎస్, సొసైటీలతో కలిసి ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచడానికి, హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏడాది పొడవునా రైతులకు పంట రుణాలు అందజేసి అండగా ఉంటామని అన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి మాట్లాడుతూ.. జిల్లాలో ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ సేవలను విస్తృత పరిచేందుకు సహకార సొసైటీలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులకు తక్కువ ధరకే ఇస్తామని తెలిపారు. రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రైతులకు సేవలందించడంతో డీసీఎంఎస్ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ విజయభాస్కర్, జిల్లా సహకార విద్యాధికారి మురళీమోహన్, డీసీఎంఎస్ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, ఏట సుధాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

పాపంపేట భూవివాదానికి శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ భరోసా


పాపంపేట వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురంరూరల్/అనంతపురం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట భూ వివాదానికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేద్దామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. గత కొన్నిరోజులుగా పాపంపేటలో సామాన్య ప్రజల భూములను, ఇళ్లను మరొకరు కాజేస్తున్నారంటూ వస్తున్న అంశంపై ఇటీవల పరిటాల శ్రీరామ్ స్పందించారు. ఈ క్రమంలోనే మూడురోజుల కిందట పాపంపేటలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బాధితులు, పాపంపేట పెద్దలతో సమావేశమవుతామని చెప్పారు. ఆ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులు, పాపంపేట పెద్దలతో బుధవారం సమావేశమయ్యారు. సమస్య పరిష్కారానికి ఏమి చేయాలన్న దానిపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. మొత్తం అక్కడ నివాసముంటున్న వారందరికీ శాశ్వత పరిష్కారం చేసే ప్రయత్నం చేద్దామని అన్నారు. మీరు ఉంటున్న నివాస గృహాలతో పాటు, కొన్న ఖాళీస్థలాలు మీకే చెందేలా శాశ్వత పరిష్కారాన్ని చూపేలా ముందుకు వెళ్దామని తెలిపారు. ఆ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్థానికులకు స్పష్టమైన హామీ ఇచ్చారు.

జేఎన్‌టీయూలో ముగిసిన సీఏఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ఇంటర్వ్యూలు గురువారం ముగిశాయి. ఈనెల 28న వర్సిటీ వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అధ్యక్షతన ఇంటర్వ్యూలు చేపట్టారు. వివిధ విభాగాల అధ్యాపకులకు ఉద్యోగోన్నతికై సీఏఎస్ కింద అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో ఇంటర్వ్యూలు చేపట్టారు. తొలిరోజు మెకానికల్, ఈఈఈ, రెండోరోజు ఈసీఈ, కెమికల్, సీఎస్ఈ, కెమిస్ట్రీ, మ్యాథమ్యాటిక్స్, మూడోరోజు సివిల్ విభాగాలకు సంబంధించిన అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో మొత్తం 45 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ బోర్డ్ ఆఫ్ మెంబర్స్, చైర్మన్లు, సబ్జెక్ట్ నిపుణులు పాల్గొన్నారు.

ఊహలు గుసగులాడే!

- ఎస్కేయూ కొత్త వీసీ నియామకంపై జోరుగా ప్రచారం
- నవంబరు మొదటి వారంలో రెగ్యులర్ వీసీ అంటూ చర్చ
- పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు


శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి త్వరలోనే కొత్త వైస్‌చాన్సలర్ వస్తారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. ఫలానా వారే వస్తారంటూ కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అన్నీ సవ్యంగా జరిగితే నవంబరు మొదటి వారంలోనే కొత్త వీసీ వస్తారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అంతకుముందు ప్రభుత్వం వర్సిటీ వీసీ నియమితులైన వ్యక్తి తన పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంబీఏ విభాగం సీనియర్ ప్రొఫెసర్ అనితకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గత ఏడాది జూన్‌లో ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఆమె వీసీ పదవి చేపట్టి 16 నెలలు కావడంతో కొత్త వీసీని నియమిస్తారంటూ ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో చాలా మంది వీసీ పదవి కోసం పోటీ పడుతున్నట్లు సమాచారం. ఎవరికీ వారు తమ రాజకీయ పలుకుబడితో ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. వర్సిటీలో పనిచేస్తున్న పలువురు సీనియర్ ప్రొఫెసర్లతోపాటు గతంలో ఇక్కడ పనిచేసిన ప్రొఫెసర్లు సైతం పోటీలో నిలిచినట్లు తెలిసింది. కొత్త వీసీ నియామకం కోసం రెండు మూడు నెలల కిందటే సెర్చ్ కమిటీ ఏర్పాటైంది. త్వరలో నియామకం జరుగుతుందని భావించినా అది కార్యరూపం దాల్చలేదు.

ఫలానా వారే వస్తారంటూ చర్చ

వర్సిటీ వీసీగా సెర్చ్ కమిటీ ఎన్‌ఐటీ ప్రొఫెసర్లు, ఐఏఎస్‌ల పేర్లు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే రాజకీయపరమైన ఇబ్బందులు వస్తాయనే భావనతో వీసీగా వచ్చేందుకు వారు ఆసక్తి చూపలేదనే ప్రచారం ఉంది. ఇటీవల ఓ యూనివర్సిటీకి సదరు కేడర్ వారిని వీసీగా నియమించినా ఆయన విధుల్లో చేరలేదు. దీంతో అదే యూనివర్సిటీలోని ప్రొఫెసర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. స్థానిక వర్సిటీ పరిస్థితి కూడా ఇలాగే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈక్రమంలో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీనే వర్సిటీ రెగ్యులర్ వీసీగా నియమించే అవకాశం ఉందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మరో వైపు గతంలో వర్సిటీలో ప్రొఫెసర్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసిన వ్యక్తి పేరుకూడా వీసీ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈయనతోపాటు వర్సిటీలోని ప్రొఫెసర్లు తమ శక్తి మేర ప్రయత్నాలు చేస్తున్నారన్న వాదనలున్నాయి. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావం లేకపోయింటే నియామక ప్రక్రియ ముగిసేదని పలువురు పేర్కొంటున్నారు.


డాక్టర్లు రాకపోవడంతో ఆర్థో ఓపీ పురుషుల విభాగంలోనే స్త్రీ, పురుషుల రిపోర్టులు చూస్తున్న పీజీ విద్యార్థులు



జనరల్ మెడిసిన్ విభాగం కార్యాలయానికి తాళం

ఓపీతో బీపీ..!

అనంతపురం వైద్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓపీ సేవలు నిరంతరాయంగా అందించాలి. అయితే నగరంలోని పెద్దాస్పత్రిలో రెండు గంటల సమయం మాత్రమే ఓపీ సేవలందుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకే డాక్టర్లు అరకొరగా ఉంటున్నారు. తర్వాత సాయంత్రం 3గంటల వరకు ఓపీ మూసివేస్తున్నారు. అనంతరం పీజీ విద్యార్థులే ఒక గంటపాటు ఓపీలో రిపోర్టులు చూసి వెళ్తున్నారని రోగులు మండిపడుతున్నారు. డ్యూటీ సమయానికి డాక్టర్లు అందరూ బయోమెట్రిక్ వేస్తున్నారు, ఫోన్‌లో ఎఫ్‌ఆర్ఎస్ కూడా వేస్తున్నారు. అయినా డ్యూటీలు మాత్రం సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

డాక్టర్ల ఓపీ డ్యూటీలు ఇలా...

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ మెడిసిన్, గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఆప్తాల్మాజీ, పల్మనాలజి, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, సైకియాట్రి, డెంటీస్ట్రీ తదితర విభాగాలున్నాయి. ఒక్కో విభాగాన్ని మూడు నుంచి ఆరు యూనిట్‌లుగా విభజించి ఒక్కో యూనిట్ ఒక్కోరోజు ఓపీ చూస్తున్నారు. డ్యూటీరోజు సంబంధిత యూనిట్ అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓపీ డ్యూటీలు చేయాలి. వారికి తోడుగా సీనియర్ రెసిడెన్సీ(ఎస్ఆర్)లు, పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) విద్యార్థులుంటారు. ఓపీకి వచ్చిన వారిని పరీక్షించి అవసరమైన రోగులను అడ్మిట్ చేసుకోవాలి. అడ్మిషన్ బుక్‌లో ట్రీట్‌మెంట్, రోగనిర్ధారణ పరీక్షలురాసి వార్డుకు పంపాలి. అడ్మిషన్ చేసుకున్న రోగులను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వార్డుల్లో రౌండ్స్‌వేసి పరీక్షించాలి. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయాలి. ఇదీ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోజువారిగా డాక్టర్లు నిర్వహించాల్సిన విధులు.

డ్యూటీలు చేస్తున్నది ఇలా...

యూనిట్ ఇన్‌చార్జ్ అయిన అసోసియేట్ ప్రొఫెసర్ ఓపీకి రావడంలేదు. చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎస్ఆర్‌లు, పీజీలు మాత్రమే ఓపీ డ్యూటీ చేస్తున్నారు. అదికూడా ఉదయం 10 వచ్చి మధ్యాహ్నం 12గంటలవరకు మాత్రమే ఉంటున్నారు. ఇక సాయంత్రం ఒకగంట సమయం పీజీ విద్యార్థులు ఓపీకి వస్తున్నారు. దీంతో మధ్యాహ్నం 12గంటలైతే ఓపీ చూడటంలేదని, మరుసటి రోజు రావల్సి వస్తోందని వివిధ ప్రాంతాల నుంచి పెద్దాస్పత్రికి వచ్చిన రోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తే, 'డాక్టర్ అన్నాక ఎక్కడో ఒకచోట ఉంటారని' జవాబిస్తున్నారు. వార్డు, ఓటీ ఇలా ఆస్పత్రి మొత్తం వెదికినా కనపడరు. ఈ విషయం పర్యవేక్షక అధికారులకు తెలియంది కాదు.

మధ్యాహ్నం మూసివేత

మధ్యాహ్నం అయితే చాలు ప్రతిరోజు దాదాపు అన్ని విభాగాల ఓపీలను మూసివేస్తున్నారు. ఆయా విభాగాల డిపార్ట్‌మెంట్ల కార్యాలయాలకు సైతం తాళాలు వేస్తున్నారు. విభాగాధిపతులు ఆయా విభాగాల ఓపీ, ఐపీ, ఆపరేషన్ తదితర క్లినికల్ సేవలను పర్యవేక్షించాలి. విభాగాధిపతులే విధుల్లో లేకుంటే కిందిస్థాయి డాక్టర్లు, సిబ్బంది ఎలా పనిచేస్తారని రోగులు, వారి సహాయకులు మండిపడుతున్నారు.


సర్జరీ ఓపీ ముందు డాక్టర్లకోసం ఎదురుచూస్తున్న రోగులు

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్ కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8తో, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2100 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రేపు పెద్దన్నవారిపల్లికి సీఎం


పెద్దన్నవారిపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం రానున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెలిప్యాడ్ స్థలం, సభావేదికను గురువారం పరిశీలించారు. ప్రతినెలా రాష్ట్రంలోని ఏదో ఒక గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్నారు. అందులో భాగంగా నవంబరు నెలకు సంబంధించి కదిరి నియోజకవర్గంలోని తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి వస్తున్నారు. తలుపుల మండలానికి ముఖ్యమంత్రి తొలిసారి వస్తుండటంతో తమ ప్రాంత అభివృద్ధికి ఏమైనా హామీలు ఇస్తారేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి : విప్


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విప్ కాలవ

డి.హీరేహాళ్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధితో ప్రపంచం రాష్ట్రం వైపు చూస్తోందని, రాబోవు స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించి .. అభివృద్ధికి మరింత సహకరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని లింగమనహళ్లిలో వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ దాసనాయక్ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ప్రత్యక్ష పోరు

- అనంతపురంలో కబ్జాల పర్వం
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి




మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగ సమస్యలపై వైసీపీ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్ ప్రారంభమై నెల గడిచినా రైతులకు పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయలేని పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విత్తనాలు, ఎరువులు కూడా సకాలంలో అందడం లేదన్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో పప్పుశనగ సాగు 70 హెక్టార్లలో ఉంటుందని, సీజన్ ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇంకా విత్తనాలు పంపిణీ చేయలేదని అన్నారు. గత ఏడాది జిల్లాకు 27వేల క్వింటాళ్ల పప్పుశనగ కేటాయిస్తే, ఈ ఏడాది 14వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఒక్క ప్రజాప్రతినిధి కూడా అడిగిన పాపాన పోలేదన్నారు. ప్రజాప్రతినిధులు తమ ఆదాయం కోసం తప్ప రైతుల గురించి ఆలోచన చేయడం లేదన్నారు. అధికారులు కూడా ప్రజాప్రతినిధుల మెప్పు కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా వ్యాప్తంగా భూ కబ్జాలు జరుగుతున్నాయన్నారు. ఎవరెప్పుడు తమ స్థలం కబ్జా చేస్తారోనని ప్రజలు భయపడుతున్నారని, కలెక్టర్, ఎస్పీ బాధితులకు భరోసా ఇవ్వలేరా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోనే రేషన్, లిక్కర్ దందా జోరుగా సాగుతోందన్నారు. అనంతపురంలో ఎమ్మెల్యే అనుచరులే భూదందాలకు పాల్పడుతున్నారని, బుడగ జంగాలకు చెందిన భూములు, ప్రైవేట్ స్కూల్ యజమానులకు చెందిన భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. పాపంపేట భూముల విషయంలోనూ ఇదే జరుగుతోందని అన్నారు. ఇనాం, శోత్రియం భూముల పేరుతో జీపీఏలు చేయించుకుని స్థలాలు ఆక్రమించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. అనంతపురంలో ఎక్కడ చూసినా మద్యం దందా సాగుతోందన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సర్దార్ వల్లభాయ్ పటేల్ (జయంతి)



'ఉక్కు మనిషి'గా పేరొందిన వల్లభాయ్ ఝవేర్‌భాయ్ పటేల్ 1875 అక్టోబరు 31న గుజరాత్ రాష్ట్రం నాడియార్‌లో జన్మించారు. దేశ తొలి ఉపప్రధానిగా కొనసాగారు. వృత్తిరీత్యా బారిష్టర్ అయినా మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాటం చేశారు. స్వాతంత్ర్య అనంతరం సంస్థానాలు దేశంలో విలీనం కావడానికి కృషి చేశారు. రాజ్యాంగ రచనలో కీలకపాత్ర వహించారు. 1950 డిసెంబరు 15న కన్నుమూశారు. మరణానంతరం 1991లో 'భారతరత్న' ప్రకటించారు. ఆయన గౌరవార్థం 2018లో ప్రపంచంలోనే ఎత్తైన ఉక్కువిగ్రహం నిర్మించారు. స్టాట్యూ ఆఫ్ యూనిటీగా కొనియాడబడ్డారు. కాగా ఆయన పేరిట ఎన్నో విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి.

సీకే నాయుడు (జయంతి)



భారత టెస్టు క్రికెట్ తొలి కెప్టెన్ సీకే నాయుడు 1895 అక్టోబరు 31న నాగపూర్‌లో జన్మించారు. వీరి పూర్వీకులు కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందినవారు. పూర్తిపేరు కొఠారి కనకయ్య నాయుడు. 'పద్మభూషణ్' అందుకున్న తొలి క్రికెట్ క్రీడాకారుడు కావడం విశేషం. దేశ క్రికెట్ చరిత్రలో రెండు దశాబ్దాలు (1916-36) నాయుడు యుగంగా పేరొందాయి. ఆరు దశాబ్దాల పాటు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడిన కొద్దిమంది క్రీడాకారులలో నాయుడు ఒకరు. రిటైరయ్యాక సెలెక్టర్‌గా, రేడియో వ్యాఖ్యాతగా ఆటతో అనుబంధం సాగించారు. 1967 నవంబరు 14న కన్నుమూశారు.

ఇందిరాగాంధీ (వర్ధంతి)



దేశ తొలి మహిళా ప్రధాన మంత్రి 'భారతరత్న' గ్రహీత ఇందిరా ప్రియదర్శిని గాంధీ 1917 నవంబరు 17న అలహాబాద్‌లో జన్మించారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. తండ్రి మరణానంతరం అనూహ్యంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. తదుప ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారు. తూర్పుపాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారు. పేరు ప్రఖ్యాతులు సాధించినా అనుకోని పరిస్థితుల్లో 'ఎమర్జెన్సీ' విధించి వ్యతిరేకత పొందారు. 1984 అక్టోబరు 31న హత్యకు గురయ్యారు. 1999లో బీబీసీ ఆన్‌లైన్ పోల్‌లో 'ఉమన్ ఆఫ్ మిలీనియం'గా గుర్తింపు పొందారు.

డాక్టర్ ఇన్నయ్య నరిశెట్టి (పుట్టినరోజు)



రాజకీయ, సాంఘిక, తత్వాకి రచయిత డాక్టర్ నరిశెట్టి ఇన్నయ్య 1937 అక్టోబరు 31న గుంటూరు జిల్లా చేబ్రోలు ప్రాంతంలో జన్మించారు. పాత్రికేయుడిగా, అనువాదకుడిగా సేవలందించారు. 'సూళపాణి'కలం పేరిట రచనలు చేశారు. ఆంగ్ల, తెలుగు భాషలలో రాజకీయాలు, తత్వశాస్త్రం, మానవత్వం తదితర అంశాలపై రచనలు చేశారు. దిన, వార, మాసపత్రికలకు రచనలు అందించారు. ప్రముఖ హ్యూమనిస్ట్ ఎంఎన్ రాయ్ రచనలను అనువాదం చేయగా తెలుగు అకాడమీ ప్రచురించింది. అమెరికా తెలుగు అసోసియేషన్‌చే 1992లో శిరోమణి అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. కొన్ని అమెరికన్ పబ్లికేషన్స్‌లో కూడా ఆయన సేవలందించారు.

కరెంటోళ్లకు..కానరాదా..?

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్వహణ లేకపోవడంతో సబ్‌స్టేషన్‌లు ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. నగరంలోని మోకా రోడ్డు కేఈబీ సర్కిల్‌లో ఉన్న రూరల్ విభాగానికి చెందిన 110కెవి సబ్‌స్టేషన్ నిర్లక్ష్యానికి పరాకాష్టగా కనిపిస్తోంది. సబ్‌స్టేషన్ నీటి కుంటలా దర్శనమిస్తున్నా... సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ కేంద్రం చుట్టూ పలు నివాస ప్రాంతాలు ఉండడంతో సబ్ స్టేషన్ నుండి ఎపుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంలో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యమని సమీప ప్రాంత ప్రజలు వాపోతున్నారు. సబ్‌స్టేషన్ లోతట్టు ప్రాంతంలో ఉన్నందున కాసింత వర్షానికే నీరు నిలబడి చెరువును తలపిస్తోంది. విద్యుత్ తీగలు అన్ని నేలపైనే ఉండడంతో కేంద్రంలో పనిచేసే సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికైనా చర్యలు తీసుకుని స్టేషన్‌ను ఎత్తు ప్రదేశంలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



సబ్ స్టేషన్ బయట నిలిచిన నీరు

ఓట్ల దొంగలు పదవులు వీడాలి

● కేపీసీసీ మీడియా ఇన్‌చార్జ్ రజాక్ ఉస్తాద్ ● పార్టీ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్ గద్దీ చోడ్' ఆందోళన

రాయచూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనైతిక మార్గంలో ఓట్ల దొంగతనానికి పాల్పడిన బీజేపీ నాయకులు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని కేపీసీసీ మీడియా ఇంచార్జ్ రజాక్ ఉస్తాద్ డిమాండ్ చేశారు. 'ఓట్ చోర్ గద్దీ చోడ్' నినాదంతో గురువారం జిల్లాలోని లింగసుగూరు బస్‌స్టాండ్ ఆవరణ ఎదురుగా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ నాయకులకు, కేంద్ర ఎన్నికల కమీషన్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేఖ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా ఇంచార్జ్ రజాక్ ఉస్తాద్ ఒక్క రాయచూరు సిటీ నియోజక వర్గంలోనే 40 వేల ఓట్లకు పైగా గల్లంతు చేశారని ఆరోపించారు. దీంతో తమ పార్టీ అభ్యర్థులు స్వల్ప తేడాతో ఓటమి పాలైయ్యారని ఇదే పరిస్థితి లింగసుగూరు నియోజక వర్గంలోను చోటు చేసుకుందన్నారు. గ్యారెంటీ పతకాల అమలు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పామయ్య మురారి మాట్లాడుతూ బీజేపీ అనైతిక మార్గంలో అధికారాన్ని దక్కించుకుందని ఆరోపించారు. బీజేపీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్ని విధ్వంసమైయ్యాయని ముఖ్యంగా ఎన్నికల కమీషన్‌ను తమ చప్పుతేతల్లోకి తీసుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పౌరులందరూ కాంగ్రెస్‌కు అండగా నిలవాలని ఓట్లను కాపాడుకునేందుకు ఓటర్లందరూ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి

● గుంతకల్లు ఆసుపత్రిలో కాలయాపన ● ఆలస్యంగా అనంతపురం పెద్దాసుపత్రికి రెఫర్

అనంతపురం వైద్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చిన గర్భిణిని అడ్మిషన్ చేసుకుని అంతా బాగుందన్న వైద్యులు, సిబ్బంది నరకం చూపించి ఆమె మృతికి కారణమయ్యారు. ఈ హృదయ విషాదగాథకు గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డాక్టర్లు, నర్సులు కారణమయ్యారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు... వజ్రకరూరు మండలం, గడేహోతూరు గ్రామానికి చెందిన యాదవుల కవిత(23) గర్భం దాల్చడంతో ఫిబ్రవరి నుంచి ఈనెల 16వరకు గుంతకల్లు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చెకప్‌లు చేయిస్తున్నారు. ఈ క్రమంలో నవంబరు 5న కాన్పు కావచ్చునని, ఆలోపు మరోసారి రావాలని సూచించి పంపారు. బుధవారం కవితకు పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో అంబులెన్స్ సాయంతో గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం 5.30 గంటలకు అత్యవసర విభాగానికి తీసుకెళ్లి అడ్మిషన్ చేయించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులు పరిశీలించి సాధారణ కాన్పు అవుతుందని అక్కడి వైద్యులు, సిబ్బంది కవిత భర్త సంగమేశ్వరకు తెలిపారు. రాత్రి 8 గంటలకు మరోసారి వచ్చి కవితకు సాధారణ కాన్పు అవుతుంది భయపడవద్దని చెప్పారు. అనంతరం కాన్పు చేసి మగశిశువు జన్మించాడని 8.52 గంటలకు చెప్పారు. కాసేపటికే బ్లడ్‌కావాలని చెప్పడంతో ఎందుకని బంధువులు అడిగారు. శిశువును తోసినప్పుడు చిన్న కుట్లు పడ్డాయని చెప్పారు. అర్ధరాత్రి 1 గంట వరకు కుట్లు వేస్తూనే ఉన్నారు. ఈ మధ్యలో ప్రమాదముంటే చెప్పాలని, పెద్దాసుపత్రికి వెళతామని వేడుకున్నా ఏమీ కాదంటూనే వచ్చారు. తెల్లవారుజామున అనంతపురం పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సిఫార్సు చేశారు. పెద్దాసుపత్రికి వచ్చిన కవితను చూసిన డాక్టర్లు అవాక్కయ్యారు. ఇక్కడ అడ్మిట్ చేసుకున్న అరగంటకే ఆమె మృతి చెందారు. కాన్పు అయిన వెంటనే రెఫర్‌చేయకుండా కవితకు నరకం చూపించి పంపారని ఇక్కడి వైద్యులు మండిపడ్డారు.



యాదవుల కవిత(ఫైల్)

24 గంటల్లోనే తారుమారు...

నా భార్య కవితను బుధవారం సాయంత్రం 4 గంటలకు గుంతకల్లు ఆసుపత్రికి తీసుకెళ్లాం. గురువారం సాయంత్రం 4గంటలకు ఖననం చేశాం. 24 గంటల్లో జీవితమే తలకిందులైంది. ప్రస్తుతం 2.5 కిలోల బరువుతో మగ శిశువు మాత్రమే మిగిలాడు. బీపీ, షుగర్ బాగుందని, సాధారణ కాన్పుచేస్తామని నా భార్యను చంపేశారు. గుంతకల్లు ఆసుపత్రిలో డాక్టర్లు లేరు, హెడ్‌నర్సులు మాత్రమే ఉన్నారు. రాత్రి 9.52 గంటలకు ప్రసవమయితే అర్ధరాత్రి 1గంట వరకు కుట్లు వేస్తూనే ఉన్నారు. ప్రమాదముంటే చెప్పాలని, పెద్దాసుపత్రికి పోతామని వేడుకున్నా పట్టించుకోలేదు. చివరి క్షణంలో అనంతపురం పంపారు. ఇక్కడ స్కానింగ్ చేస్తే చాలా రక్తం పోయింది.. పల్స్‌రేట్ లేదని డాక్టర్లు చెప్పారు. తర్వాత 20 నిమిషాలకే మరణించింది. మేము కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. నిర్లక్ష్యానికి కారణమైన వారిని శిక్షించాలి. నాలాగ ఎవరికీ అన్యాయం జరగకూడదు. - సంగమేశ్వర, కవిత భర్త

హోమాలు.. పూర్ణాహుతి

నెట్టికంటి ఆలయంలో కొనసాగుతున్న పూజలు

గుంతకల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో రాజగోపుర కలశ స్థాపనా కార్యక్రమంలో భాగంగా గురువారం పలు రకాల హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం దేవస్థాన యాగశాలలో చతుర్వేద పారాయణం, నిత్యారాధన, ద్వారాతోరణ పూజ, ఉప కుంభారాధన, చతుఃస్థానార్చన, నవకలశ స్నపనం, మూల మంత్ర హవనం, మన్యుసూక్త హవనం, సుదర్శన హవనం, సుదర్శన అభిషేకం, పంచసూక్త హవనం, పరివార ప్రాయశ్చిత్త హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం పారాయణాలు, అర్చనలు, ఆరాధనలతో పాటు పలు నదుల నుంచి తెచ్చిన జలాలతో 18 కలశాల శయ్యాధివాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ విజయరాజు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11-11 గంటలకు కలశాల శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, వీరేశ్ కుమార్, ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ అధికారులు, అర్చకులు, వైదికులు, సిబ్బంది పాల్గొన్నారు.

3న ఎస్కేయూలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

అనంతపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి వివిధ విభాగాల్లో అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అంజనేయులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబరు 3న ఉదయం 10గంటలకు సంబంధిత విభాగాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, యూఎస్ఐఏఅండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో రెండు చొప్పున, బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, పాలిమర్‌సైన్స్, సెరికల్చర్, కామర్స్, హిందీ విభాగాల్లో ఒకటి చొప్పున భర్తీ చేస్తామని అన్నారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

ఎస్కేయూలో పలువురి బదిలీ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పలువురు ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ రమేష్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్‌లో పనిచేస్తున్న సూపరింటెండెంట్ నాగసుధను ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ సెక్షన్‌కు, ఎస్కేయూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ధర్మయ్యను కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. జాగ్రఫీ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డిని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీకి, ఎవాల్యూయేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దస్తగిరిని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకుషన్‌కు బదిలీ చేశారు. అదే విధంగా కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పనిచేస్తున్న కోదండపాణిని జాగ్రఫీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు.

కుక్కదాడిలో తెగిన చిన్నారి చెవి

బెంగళూరు ఆసుపత్రికి తరలింపు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకు కుక్కల బెడద అధికమవుతోంది. ఇందుకు గురువారం సాయంత్రం నగరంలో జరిగిన ఘటనే నిదర్శనం. ఎర్రనేలకొట్టాల కాలనీలో నివసిస్తున్న ప్రకాష్, సునీత దంపతుల కుమార్తె షైనీ ఒకటో తరగతి చదువుతోంది. ఇంటి నుంచి సాయంత్రం అంగడికి వెళ్లి తిరిగి వస్తున్న చిన్నారి షైనీపై ఒక్కసారిగా కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు కుక్కను తప్పించాలని యత్నించగా ఎంత సేపటికీ వదల్లేదు. కుక్క తీవ్రంగా కరవడంతో చిన్నారి ఎడమ చెవి తెగిపోయింది. స్థానికులు గట్టిగా అరవడంతో వదిలేసింది. తల్లిదండ్రులు సమాచారం తెలుసుకుని చిన్నారిని హుటాహుటిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోస బెంగళూరుకు తరలించా రు. తెగిన చెవితో సహా అంబులెన్స్‌లో బెంగళూరుకు తీసుకెళ్లారు. తాను ప్రైవేటుగా చిరు ఉద్యోగం చేస్తున్నానని, తన కూతురు వైద్యానికి ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ సహకరించి ఆదుకోవాలని చిన్నారి తండ్రి ప్రకాష్ వేడుకున్నారు. కుక్కల సమస్యను పరిష్కరించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవతీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నారికి తెగిన చెవి

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

హిందూపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. వారి నుంచి 11 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. రెండు రోజుల కిందట తూమకుంట చెక్‌పోస్టులో అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అటువైపు బైక్‌పై వచ్చిన వారిని ఆపి, వాహన పత్రాలను అడిగారు. వారు ఎలాంటి రికార్డులు చూపించకపోవడంతో అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించారు. దీంతో ఆ బైక్‌ను హిందూపురం మండలం రామచంద్రాపురం వద్ద చోరీ చేసినట్లు తెలిపారు. ఓ షెడ్డులో దాచి ఉంచినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో హిందూపురం మండలం రామచంద్రాపురానికి చెందిన మోక్షిత్, గౌరీబిదనూరుకు చెందిన ఉమర్‌ఫారూక్, హిందూపురం ఆటోనగర్‌కు చెందిన జమీర్‌ఖాన్‌లు ఉన్నారు.

ఓటరు నమోదు ప్రారంభం



ప్రసంగిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ హనుమంతప్ప

రాయచూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అధ్యాపక వృత్తిలో ఉన్న వారందరూ ప్రజా ప్రభుత్వంలో భాగస్వాములు కావడం ద్వారా ప్రజాస్వామ్యవ్యవస్థను పటిష్టం చేసేలా తమవంతు కృషి చేయాలని రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎం.హనుమంతప్ప సూచించారు. ఈశాన్య ఉపాధ్యాయ నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల నమోదు ప్రక్రియను గురువారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో చేపట్టారు. రెండవ దఫా చేపట్టిన ఓటరు జాబితాలో పేర్ల నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉపకులపతి అధ్యాపకులు తమ వృత్తి పరంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వానికి తమసమస్యలను వినిపించేందుకు ఓటింగ్‌లో పాల్గొనడాన్ని బాధ్యతగా గుర్తించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా కార్యక్రమంలో పాల్గొన్న రాయచూరు తహసీల్దార్ సురేశ్ వర్మ, పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ అర్హతలు తదితర వాటి గురించి వివరించారు.

ట్రక్కు డ్రైవర్‌కు గుండెపోటు

● బోల్తా పడిన వాహనం.. డ్రైవర్ మృత్యువాత



బోల్తా పడిన ట్రక్కు



నరసింహ(ఫైల్)

రాయచూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పత్తి లోడ్‌తో వెళుతున్న మినీ ట్రక్కు డ్రైవర్ నరసింహ(33)కు గుండెపోటు రావడంతో వాహనం బోల్తా గొట్టింది. గురువారం ఉదయం రాయచూరు తాలూకాలోని గారలదిన్ని నుంచి రాయచూరు మార్కెట్‌కు పత్తి లోడ్‌తో వస్తున్న వాహనం డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో వాహనం అదుపు తప్పింది. డ్రైవర్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు దీన్ని గమనించిన రైతులు, స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

బాగలూరులో తైవాన్ పింక్ జామ సాగు



తెగులు సోకకుండా జామ చెట్టుకు కవర్లు కడుతున్న మహిళ

హోసూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు, బాగలూరు , డెంకణీకోట పరిసర ప్రాంతాలలో కూరగాయలు, పూలను విస్తృతంగా సాగు చేస్తారు. బాగలూరు ప్రాంతంలో 20 ఎకరాలకు పైగా రైతులు తైవాన్ జామ సాగులో నిమగ్నమై ఉన్నారు. వివిధ రకాల జామ రకాలు ఉన్నప్పటికి తక్కువ సమయంలోనే ఫలాలు ఇస్తాయి. ఈ తైవాన్ పింక్ జామకు ఇతర రాష్ట్రాలు, విదేశాలలో మంచి ఆదరణ ఉంది. దీంతో తైవాన జామ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతులు మాట్లాడుతూ తైవాన్ పింక్ జామకు ఇతర జామ రకాల కంటే తక్కువ నీరు సరిపోతుందని, నాటిన 3 నెలల్లోనే కాయలు వస్తాయన్నారు. ప్రారంభంలో ఎకరానికి 2 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వ్యాపారులు జామను కొనుగోలు చేయడానికి వస్తున్నారన్నారు. విదేశీ మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.120 వరకు ధర ఉందన్నారు. తెగులు బారిన పడకుండా ఉండటానికి తాము మొలకలను ప్లాస్టిక్ కవర్లతో రక్షిస్తున్నామని, అలాగే బూజు తెగులు సోకడం తగ్గుతుందన్నారు. తైవాన్ జామ మంచి ఆదాయ వనరుగా ఉందన్నారు. కావున జామ మొలకల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తే మరింత అనుకూలం కానుందన్నారు.

ఆన్‌లైన్ ద్వారా తొలి కేసు పరిష్కారం

● సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్

అనంతపురం క్రైం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిసారి ఆన్‌లైన్ ద్వారా ఒక విడాకుల కేసును పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్ తెలిపారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ కేసును తొలిసారి ఆన్‌లైన్ మీడియేషన్ ద్వారా గురువారం పరిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. తమకు విడాకుల కేసు అవసరం లేదంటూ బెంగళూరుకు చెందిన జంట మీడియేషన్ సెంటర్ కో- ఆర్డినేటర్, న్యాయాధికారి రాజశేఖర్‌ను కోరారు. బెంగళూరులో నివాసం ఉంటున్న కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోవడంతో మధ్యవర్తి హరికృష్ణ ద్వారా ఆన్‌లైన్‌లో మీడియేషన్ నిర్వహించారు. కేసు అవసరం లేదంటూ ఒప్పంద పత్రాన్ని ఈ మెయిల్ ద్వారా పంపారు. దీంతో మీడియేషన్ చట్టం 2023 సెక్షన్ 30 ఆధారంగా వారి కేసును పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. కోర్టు సమస్యల నుంచి సత్వరం బయటపడటానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గమని న్యాయాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు.



కాలి బూడిదయిన పత్తి బేళ్లు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కాటన్ మిల్లులో అగ్నిప్రమాదం

బళ్లారి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ పత్తిమిల్లులో అగ్నిప్రమాదం జరగడంతో భారీ నష్టం వాటిల్లింది. నగర సరిహద్దులోని దీప్తి కాటన్ మిల్లులో గురువారం మంటలు చెలరేగి భారీగా పత్తి దగ్ధం అయ్యింది. తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పత్తి కాలిపోయింది. భారీగా మంటల కారణంగా పత్తి కాలిబూడిదయ్యింది. అగ్నిప్రమాద శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే భారీగా పత్తి కాలి బూడిదయ్యింది. నష్టం ఎంత వాటిల్లిందని లెక్కల్లో తేలాల్సి ఉంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,127	14,134
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	14,769	13,774
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77



ఎక్స్‌కవేటర్లతో రిసార్ట్‌ను తొలగిస్తున్న అధికారులు

అక్రమ కట్టడాల కూల్చివేత

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపి పరిధిలోని ఆనెగొంది, హనుమనహళ్ళి, రంగాపుర, సనాపుర గ్రామాల్లో అక్రమంగా నిర్మించిన ఆరు రిసార్ట్‌లను, గుడిసెలను, కట్టడాలను అధికారులు తొలగించారు. ఒక రిసార్ట్‌కు సంబంధించి కేసు ఇంకా కోర్టులో విచారణలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. హంపి వరల్డ్ హెరిటేజ్ సైట్ మేనేజ్‌మెంట్ అథారిటీ కమీషనర్ రమేష్ వత్గల్ మాట్లాడుతూ, ఆనెగొంది, భాగంలో అనేక రెవెన్యూ భూముల్లో ప్రాధికార నియమాలు ఉల్లంఘజించి అనధికృతంగా కట్టడాలు, రెసార్ట్‌లు, గుడిసెలు నిర్మించకున్నట్లు తెలిపారు. ఇలాంటి కట్టడాల నిర్మాణాల ద్వారా విజయనగర కాలంలో చారిత్రక స్థలాలకు ప్రాధాన్యం తగ్గిపోతుంది. అక్రమ రిస్టార్ట్‌లకు విద్యుత్ ఇవ్వరాదని ఉన్నా కొంతమంది రెసార్ట్ యజమానులు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఆనెగొంది చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన రెస్టారెంట్లను తొలగిస్తున్నట్లు, 16 అనధికృత రెస్టారెంట్లకు సంబంధించి ఇంకా కోర్టులో విచారణ దశలో ఉన్నట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలు అందితే వాటిని కూడా తొలగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు యు.నాగరాజు, రూరల్ పోలీసు స్టేషన్ పీఐ రంగప్ప, దొడ్డమనిలతో పాటు హంపి ప్రపంచ పర్యాటక ప్రాంతాల నిర్వహణ ప్రాధికార, తాలూకా పాలనా మండలి, రెవెన్యూ, జెస్కాం, ఆనెగొంది, సణాపుర గ్రామ పంచాయతీ పీడీఓ తదితరులు పాల్గొన్నారు.

రేపు వికాస్ బ్యాంక్ ప్రారంభం

హోస్పేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని హోస్పేట కేంద్రంగా పనిచేస్తున్న వికాస్ సౌహార్ద కోఆపరేటివ్ బ్యాంక్‌సర్దార్ పటేల్ మెయిన్ రోడ్డులోని తన స్వంత నాలుగు అంతస్తుల భవనంలోతన కార్యకలాపాలను కొనసాగిస్తుందని, వినియోగ దారులు గమనించాలని బ్యాంక్ అధ్యక్షుడు విశ్వనాథ్ సీహెచ్ హిరేమత్ గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో వినియోగదారులు 24గంటలు నిర్వహించగలిగే డిజిటల్ వాల్ట్(లాకర్) సౌకర్యం, వర్షపు నీటి సంరక్షణ మరియు సౌర విద్యుత్‌ను కలిగి ఉన్న మొట్టమొదటిబ్యాంకు ఇదేనన్నారు. వికాస్ బ్యాంక్ అయిన మొదటి బ్యాంక్ ఇదే అవుతుందని అన్నారు. ఇక్కడ గ్రౌండ్‌ఫ్లోర్ 10 నెలల్లో ప్రారంభమవుతుందని అన్నారు. ప్రారంభోత్సవానికి శుక్రవారం గవిమఠం కొత్తూరు బసవలింగ మహాస్వామిజీ, అభినవ గవిసిద్దేశ్వర మహాస్వామీజీ, వి సాఫ్ట్‌కు చెందిన మూర్తి వీరగంటి, గోద్రేజ్‌కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పెర్సీ మాస్టర్ బహాదూర్ హాజరవుతరని తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు సలహాదారు విజె కులకర్ణి, సీనియర్ దర్శకుడు ఛాయా దివాకర్, రమేష్ పూరోహిత్, ఎం వెంకప్ప, కె వికాస్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న హిరేమత్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

● జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి శాంతి ● అధికారులు, ప్రజలు చేతులు కలపాలని పిలుపు



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవినీతిని నిర్మూలించడానికి అధికారులు, ప్రజలు చేతులు కలపాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, న్యాయాధికారి శాంతి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా న్యాయవ్యవస్థ, జిల్లాన్యాయసేవల ప్రాదికారసంస్థ, జిల్లాన్యాయ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన మన సామాజిక బాధ్యత నినాదంతో నగరంలోని జిల్లాకోర్టు సముదాయంలో నిర్వహించిన అవగాహన వారోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశంలో అవినీతిని నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అక్టోబరు 27నుంచి నవంబరు 2వరకు అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీబీసీ) భారత ప్రభుత్వానికి చెందిన అత్యున్నత సంస్థ అని ఇది 1964 లో స్థాపించబడిందని మొదట కర్ణాటకకు చెందిన నిట్టూరు శ్రీనివాస్‌రావు దీనికి సేవలందించారని అన్నారు. ప్రభుత్వ రంగంలో నిజాయితీని ప్రోత్సహించడం , అవినీతిని నిరోదించడం ప్రభుత్వ రంగాల వ్యవస్థను మెరుగుపరచడం, పనిలో పారదర్శకతను పెంచడం , ప్రభుత్వ అధికారుల జవాబుదారీతనాన్ని పెంచడం దీని ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే అధికారులు ప్రజల నుండి లంచం తీసుకోకుండా పనిచేయాలని ప్రతి ఒక్కరూ తమ విధులను నమ్మకంగా నిర్వర్తించాలని. అవినీతి రహిత, మాదకద్రవ్య రహిత భారతదేశాన్ని రూపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ సౌకర్యాలు, సేవల గురించి సాధరణ ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా లీగ్ సర్వీసెస్ అథారిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారికీ ఉచిత న్యాయవాదులను నియమించడం ద్వారా ఉచిత న్యాయసేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ న్యాయాధికారి ప్రమోద్,అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రాఘవేంద్రగౌడ, వాసుదేవరాదాకాంత్‌గుడి, జిల్లా కుటుంబ ప్రిన్సిపల్ న్యాయాధికారి వెంకటేశ్, జిల్లా కోర్టులోని వివిధ న్యాయమూర్తులు, జిల్లాకోర్టు అధికారులు, సిబ్బంది , న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీలో యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

బళ్లారి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిస్తూ యూనియన్ బ్యాంకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అవినీతి రహిత భారత్ నిర్మాణం కోసం అందరూ కలిసి నిజాయితీగా పనిచేయాలని, కలిసికట్టుగా సంకల్పం తీసుకుని దేశ ప్రతిష్టను ప్రపంచదేశాల్లో మరింత పెరిగేలా చూడాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ కొట్టే సుబ్బారావు అన్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో బాగంగా గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. రాయల్ సర్కిల్ నుంచి సంగం సర్కిల్ వరకు చేపట్టిన ర్యాలీలో కొట్టే సుబ్బారావు మాట్లాడుతూ అవినీతి రహిత భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. బ్యాంకు ఉద్యోగులు అవినీతి రహిత భారత్, విజిలెంట్ భారత్ టు వికాసిత్ భారత్, అలాగే ప్రతి విజిల్ బ్లోయర్ దేశ రక్షకుడు కూడా అవినీతి రహితం కోసం ప్రచారం చేపట్టాలన్నారు. అవినీతి అంతం అయితేనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. వీరితో పాటు డిప్యూటీ రీజనల్ హెడ్‌లు రాజేష్ గోనుగుంట్ల, దండు నాయక, విజిలెన్స్ ఆఫీసర్ మలవతు యుగంధర్, మోతీలాల్ పత్తిలావత్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

సాగునీటిపై అఖిల పక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వెంకటరావ్ నాడగౌడ

రాయచూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎడమ కాలువ విభాగంలో రెండవ పంటకు సాగునీటి ఇవ్వాలని అఖిల పక్షం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావం వల్ల ఇప్పటికి జలాశయానికి ఇన్‌ఫ్లో ఉన్న నేపద్యంలో రబీ సీజన్‌కు కావల్సిన నీటి లభ్యత రిజర్వర్‌లో ఉన్నందున రైతులకు తగిన న్యాయం చేయాలని నాయకులు కోరారు. మాజీ మంత్రి వెంకటరావ్ నాడగౌడ ఆధ్వర్యంలో గురువారం సింధనూరులోని సర్క్యూట్ హౌస్‌లో అన్ని పార్టీలు రైతు సంఘాలు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సభలో మాట్లాడిన నాయకులు నీటి లభ్యత వినియోగం రెండవ పంటకు ఎదురైయ్యే ఇబ్బందుల గురించి ఇప్పటికే సాగునీటి రంగ నిఫుణుడైన కన్నయ్య నాయుడును సంప్రదించగా ఆయన రెండవ పంటకు నీరివ్వడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేసినట్లు మాజీ మంత్రి వెంకటరావ్ నాడగౌడ సభకు వివరించారు. ఈ విషయంలో ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని పార్టీలు ప్రతినిధుల బృందంతో కలిసి ముఖ్యమంత్రిని కలిసేందుకు నిర్ణయించారు.

కౌన్సిలర్ల సహకారంతోనే అభివృద్ధి: కమిషనర్

సిరుగుప్ప, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కౌన్సిలర్ల సహకారంతో నే పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తి చేయగలమని కమిషనర్ గంగాధర అన్నారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో నగరసభ కార్యాలయంలో కమిషనర్ గంగాధర, అధ్యక్షురాలు రేణుకమ్మ ఆధ్వర్యంలో 7వ సామాన్యసభ జరిగింది. ఈ సభలో గత జూలైలో జరిగిన పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కౌన్సిలర్లు ఈ చర్చల్లో ప్రజలకు అవసరమైన వాటికి తీర్మానాన్ని వెల్లడించారు. మరికొన్నింటిని పెండింగ్‌లో పెట్టడం జరిగింది. పట్టణంలో శానిటరీ అధికారులు పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యధోరణి వహిస్తున్నారని కౌన్సిలర్లు మోహన్‌రెడ్డి, మల్లికార్జున, రాయుడు, పీరా హుస్సేన్‌లు తీవ్రంగా మండిపడ్డారు. చెత్తాచెదారాన్ని వారం రోజులైనా శుభ్రం చేయకుండా అలాగే వున్నాయని కౌన్సిలర్లు దుయ్యబట్టారు. పీరా హుస్సేన్ రెండవ వార్డులో రెండేళ్లక్రితం జరిగిన పనులను మరలా సమావేశంలో ఆ పనులపై చర్చించడం సరైందికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరసభ ఏఈఈ రమేష్, పనులు జరిగాయి కానీ ఇంతవరకు బిల్లులు కాలేదన్నారు. కౌన్సిలర్ల అనుమతితోనే ఈ బిల్లు పాసవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ గంగాధర మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, విద్యుత్ పరిశుభ్రత విషయంపై అందరూ సహకారం అత్యవసరమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నగరసభ ఉపాధ్యక్షురాలు యశోద, సమన్వయ అధికారి అమరేశప్పలు మాట్లాడుతూ పీఎంజీఎస్‌వై వీధి వ్యాపారులు ఇన్సూరెన్స్ చేసుకుంటే రూ. రెండు లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని ఆయన తెలిపారు. నగరసభ ఇంజనీర్లు ప్రియాంక కౌన్సిలర్లు షైకేల్ వీరేష, నాగరాజ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కమిషనర్ గంగాధర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ రావు

ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చు

● రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు భాస్కర్ రావు

బళ్లారి సిటీ,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యూత్‌రెడ్‌క్రాస్ ద్వారా అవసరమైన ప్రథమ చికిత్స నైపుణ్యాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, దీంతో విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు భాస్కర్ రావు అన్నారు. విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ అంబేడ్కర్ సభా భవనంలో నిర్వహించిన ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ తన సేవలకు గాను ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతిని నాలుగు సార్లు గెలుచుకుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 190దేశాలలో దీనికి శాఖలు ఉన్నాయని, ప్రపంచానికి మానవతా విలువలను తెలియజేయడమే రెడ్‌క్రాస్ ప్రాథమిక ఉద్దేశమన్నారు. ఈ విషయంలో పాఠ్యాంశ కార్యకలాపాలతో పాటు సామాజిక సేవల్లో పాల్గొనాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి బళ్లారికి వచ్చి 11రోజుల రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఉమాకాంత్, యూనివర్సిటీ యూత్‌రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. తదనంతరం శిక్షకులు వివిధ అత్యవసర పరిస్థితుల్లో నిర్వహించాల్సిన ప్రథమ చికిత్స పద్దతులను విద్యార్థులకు వివరించారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి షకీబ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్స్ విభాగధిపతి డాక్టర్ శశిధర్ కెల్లూర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

నగరంలోని డాక్టర్ రాజ్ కుమార్ రోడ్డులోని బసవరాజేశ్వరీ పబ్లిక్ స్కూల్, కళాశాలలో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాఠశాలలో అగ్నిప్రమాదంపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వారు వివరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ రావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ కులం మతం లేకుండా మానవత్వం ఆధారంగా పనిచేస్తుందని, కుక్కకాటు సందర్భంలో ఎలాంటిచర్యలు తీసుకోవాలోవిద్యార్థులకు చెప్పారు. ఈకార్యక్రమంలో బీపీఎస్సీ స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్,బిపీఎస్సీ స్కూల్ ప్రిన్సిపాల్ , అనిల్ కుమార్, షకీబ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ సుప్రీత్‌కు ఉత్తమ సేవా అవార్డు



ఎస్ఐకి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ శోభారాణి

కంప్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : కురుగోడులో వరుసగా నాలుగు నెలలుగా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులను పరిష్కరించి పోలీస్ స్టేషన్‌కు ఖ్యాతిని తెచ్చిన జనస్నేహి పోలీస్ అధికారి ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షప్పను ఎస్పీ శోభారాణి గురువారం ప్రశంసించారు. నగరం లోని ఎస్పీ కార్యాలయం లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ విరుపాక్షప్పమాట్లాడుతూ పోలీసులు భయం గురించి కాదు, నమ్మకం, విశ్వాసం ప్రజలతో సమన్వయం గురించి చర్చించుకోబడాలన్నారు. పోలీసుల పట్ల ప్రజల అవగాహనను మెరుగుపరచడానికి మేము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నాము. ఈ శాఖ నుంచి తనకు లభించిన గౌరవం, భవిష్యత్తులో తన పనితీరును మెరుగు పరచడంలో ఎంతో సహకారం పడుతుందన్నారు. ప్రతి విషయానికి తమ అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో కృషి వల్లనే అన్ని కేసులను విజయవంతం చేపట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ అంటేనే ఒక కుటుంబం అన్నారు. సుప్రీత్ విరుపాక్షప్పకు ఉత్తమ సేవకుడిగా గుర్తింపు పొందడంతో పలువురు ఎస్ఐని అభినందించారు.

రేపు వైద్య శిబిరం

బళ్లారి రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా నవ కర్ణాటక నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో కప్పగల్లు గ్రామంలో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉచిత ఆరోగ్య చికిత్స నిర్వహిస్తున్నట్లు నవ కర్ణాటక నరసింహం డాక్టర్ షమీర్ తెలిపారు. అలాగే డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని పలు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

కంప్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా కడేమనె నాగరాజు, ఉపాధ్యక్షురాలిగా జీ అయ్యమ్మలు ఎన్నికయ్యారు. గురువారం కంప్లిలో ఎన్నికలు వ్యవసాయ అసోసియేషన్ కార్యాలయంలో జరిగాయి. అధ్యక్ష పదవికి కడేమనె నాగరాజు, ఉపాధ్యక్ష పదవికి జీ అయ్యమ్మ నామినేషన్ దాఖలు చేయగా వారు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు రిటర్నింగ్ అధికారి రాము ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రమేష్, ముఖ్య కార్యనిర్వహణా ధికారి కే వీరేష్, డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, అంజినప్ప, ఎస్ ఆంజనేయులు, విబి నాగరాజు, అరలె ముత్తయ్య, హనుమంతప్ప కారుబారు, కే రాధ, టీ రాము, దొడ్డబసప్ప, అల్లి నాగరాజు, పి బాపురావు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యే జేఎన్ గణేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. వ్యవయసాయ ఉత్పత్తులకు సరైన ధరలు అందేలా చూసి రైతులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు, నాయకులు మూకయ్య స్వామి, కడేమనె పంపాపతి, హళ్లల్లి వీరేష్, వెంకటరామరాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగను సద్వినియోగం చేసుకోండి: ఏడీ

సిరుగుప్ప, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వేరుశనగను అందజేస్తోందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథ రెడ్డి సూచించారు. గురువారం సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణం రైతు సంపర్క కేంద్రంలో వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. ప్రతి రైతు ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, భూమి పాసుపుస్తకంతో వస్తేనే విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి పురుషోత్తమ, రైతులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మునుస్వామి

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

హోసూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వేపనపల్లి నియోజకవర్గంలో రూ.29 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన తారు రోడ్డు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కేపీ మునుస్వామి భూమిపూజ చేశారు. కృష్ణగిరి జిల్లా వేపనపల్లి నియోజకవర్గం పరిధిలోని శూలగిరి యూనియన్‌లో అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునుస్వామి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి వివిధ పనులను ప్రారంభించారు. తొరపల్లి పంచాయతీలోని దాసనపురం గ్రామంలో ఎమ్మెల్యే అభివృద్ధి నిధి క్రింద రూ.5 లక్షల అంచనా వ్యయంతో కొత్త సిమెంట్ రోడ్డు, కోనేరిపల్లి పంచాయతీలోని నల్లగానకొత్తపల్లిలో రూ.7 లక్షలతో సిమెంట్ రోడ్డు, భారతీపురంలో రూ.17 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. తొలుత కనలట్టి గ్రామంలో రూ.5.75 లక్షలతో నిర్మించిన నీటి తొట్టెలను ప్రజల వినియోగానికి పైపు లైన్‌లు అనుసంధానం చేశారు. ఇదే సందర్భంగా అన్నాడీఎంకే శూలగిరి వెస్ట్ యూనియన్ కార్యదర్శి మాదేశ్ నేతృత్వంలో ప్రజలకు ఆహార ధాన్యాలు పంపిణీ చేసి, మహిళలకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శూలగిరి నార్త్ యూనియన్ కార్యదర్శి బాబు వెంకటాచలం, కృష్ణగిరి వెస్ట్ జిల్లా కోశాధికారి మ్లియన్, ఎంజీఆర్ యూత్ లీగ్ జిల్లా జాయింట్ సెక్రటరీ రంగనాథ్, మహిళలు సంఘాలు, యూనియన్ కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

క్రీడామైదానంలో సౌకర్యాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే

హోసూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని కామరాజ్ కాలనీ క్రీడామైదానంలో ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లే వారికి ప్రాథమిక సౌకర్యాలు కల్పించనున్నట్టు ఎమ్మెల్యే ప్రకాశ్ తెలిపారు. గురువారం మైదానాన్ని డిప్యూటి మేయర్ ఆనందయ్యతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. క్రీడా మైదానానికి అవసరమైన పరికరాలు, ప్రాథమిక వసతులు ఏర్పాటు చేస్తామని, కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, వార్డు కార్యదర్శి కుమార్, బీజేపీ మాజీ కౌన్సిలర్ నందకుమార్, కృష్ణశెట్టి, మంజునాథ్, మాదేశ్, గోవిందన్ పాల్గొన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య

శభాష్..దినేశ్..!

● రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ప్రీకాస్ట్ టెక్నాలజీ
● అవార్డులు అందుకున్న కలెక్టర్ దినేశ్ కుమార్



ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ దినేశ్ కుమార్

హోసూరు అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి సేలం వరకు వెళ్లే రైల్వే మార్గంలో అండర్‌పాస్‌ను బ్రిడ్జ్‌గా ఆధునీకరించారు. 6 లేన్ల రోడ్డు మార్గంలో ప్రీ-కాస్ట్ టెక్నాలజీతో బ్రిడ్జ్‌ను నిర్మించారు. 40 రోజులలో రైళ్ల సంచారానికి ఆటంకం లేకుండా పూర్తి బ్రిడ్జ్‌ను పూర్తి చేయడంతో ఏసియా బుక్ ఆఫ్ రికార్ట్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఇందుకు సంబంధించి ప్రమాణపత్రాన్ని కలెక్టర్ దినేశ్ కుమార్‌కు స్వయంగా అందజేశారు. కృష్ణగిరి జిల్లాలో 238 కిలోమీటర్ల మేర శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డు (ఎస్‌టీఆర్ఆర్) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా హోసూరు చుట్టూ 45 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సేలం-బెంగళూరు రైల్వే లైన్, ఎస్‌టీఆర్ఆర్ రోడ్డు హోసూరు మరియు కెలమంగలం మధ్య ఉన్న ఒన్నలవాడీ గ్రామం దగ్గర కలుస్తుంది. ఈ రైల్వే లైన్‌పై ప్రతిరోజూ కోయంబత్తూరు, మధురై, కేరళ, తిరునల్వేలి వంటి ప్రాంతాలకు 50కు పైగా రైళ్లు నడుస్తాయి. రైల్వే ట్రాక్ క్రింద ఇప్పటికే సిద్ధంగా ఉన్న 17 మీటర్ల వెడల్పు, 6.85 మీటర్ల ఎత్తు 8 మీటర్ల పొడవు గల ఆర్‌సీసీ వంతెనను తరలించడం ద్వారా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 40 రోజుల్లో వంతెనను నిర్మించారు. దీనిని ఇండియా బుక్ ఆఫ్ రికార్ట్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్ట్స్ గుర్తించారు. ఈ వంతెన పూర్తిగా రైల్వే ట్రాక్ క్రింద నిర్మించబడింది. కానీ రైళ్లు ఒక్కరోజూ కూడా ఆగలేదు. బ్రిడ్జ్‌ను తక్కువసమయంలో ఆటంకం లేకుండా పూర్తి చేసినందుకు కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. కృష్ణగిరి కలెక్టర్ దినేశ్‌కుమార్, హోసూరు సబ్ కలెక్టర్ అకృతి శెట్టి, కర్మాగారం ఛైర్మెన్ కిషోర్ నాయక్, బీరేష్ పటేల్, శశిభూషణ్ సింగ్‌లకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలతో సత్కరించారు. కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డులోని రైల్వే వంతెన క్రింద 17 మీటర్ల వెడల్పు మరియు 24 మీటర్ల పొడవు ఉన్న ఈ వంతెనను జాకీలు 40 రోజుల్లో రైల్వే ట్రాక్ క్రిందకు తరలించి రికార్డు సృష్టించారన్నారు. ఈ రికార్డును సృష్టించిన నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, మోంటే కార్లో కంపెనీ, ఇతర ఇంజనీర్లకు సర్టిఫికెట్లు అందచేసి గౌరవించారు.



40 రోజుల్లో పూర్తయిన రైల్వే వంతెన